
# ఆనంద్

* రచన · కుమారి ఎ. వెంకటరత్నం *



ఆనంద్ .........

'తన పేరు చిరకాలము పేరుకుతగ్గట్లు వర్ధిల్లమని ఆశీర్వదించి పెద్దలు నిర్ణయించి తండ్రిచేత బియ్యంతో వ్రాయించిన పేరు హుఁ, ఆనంద్, ఒకసారి, మరొకసారి, వేరొకసారి, ఇంకొకసారి, నోరారా వర్ణించుకున్నాడు తన విద్యార్థిదశలో నలుగురు మిత్రులుకలసి 'ఆనంద్ ఆనంద్' అని పిలుస్తూవుంటే గర్వించేవాడు. తనకా పేరును యుదహరించిన తల్లి, దండ్రులకు లోలోన నమస్కరించేవాడు. 'ఒరేయ్, ఆనంద్' అని తల్లి దండ్రులుపిలుస్తే తనకు తప్ప మరొకరికి ఆ పేరు యుండదన్నట్లు, ఎంత పనిలో యున్నా వారిపిలుపుకు అంచలుమీద వచ్చేవాడు. తన ఏకైక అభిమానురాలు తోబుట్టువు అయిన అక్కయ్య 'ఆనంద్' అని ముద్దుగాపిలిస్తే పరవళ్ళు త్రొక్కేవాడు. ఆమె తృప్తికి సరదాగా 'తమ్ముడు' అనిపిలిస్తే చిన్నపిల్లాడులాగ మారాముచేసి తిరిగి 'ఆనంద్' అని పిలిచేవరకు యూరుకొనేవాడుకాదు. తుదకు కల్యాణి తమ్ముడు మనస్సు కష్టపెట్టలేక 'ఆనంద్' అనిపిలిచి ఆనందడోలికలో ముంచేది.

అటువంటి పేరు కాలానుగుణ్య మారిపోయింది. అంటే పేరు మారలేదు. అదే స్థలములో విధివ్రాతగా కష్టాలు చేరేయి.

భావిజీవితాన్ని తలంచుచూ, చెక్కిళ్ళపై కారిన కన్నీటిని తుడుచుకొని తను కూర్చున్నప్రదేశాన్ని పరికించేడు. చీకటి ఆవరించిందని తెలియబరుస్తూ రోడ్డుమీద దీపాలు వెలిగేయి. కార్లు, బస్సులతో రహదారి పట్టపగ్గాలు లేకుండయుంది. సాయంత్రపు శీతవాయువులకు సముద్రపుటొడ్డునకు వచ్చిన ప్రజానీకము యింటిదారి పట్టినట్లు తనచుట్టుప్రక్కల ఎవరు లేకపోవడముచూచి చాలసేపై తానీలోకములో లేడని తలచినపిదప చిన్న బలహీనపు నవ్వు యొక్కసారి పెదవులపై నాట్యమాడి, అంతలోనే అంతర్థానమైంది. బట్టలు దులుపుకొని ఆనంద్ కూడ యింటిదారి పట్టేడు.

'ఏంరా ఎక్కడికి వెళ్ళేవు' అని అప్పుడే మధ్య గదిలో అడుగుపెడుతున్న ఆనంద్ని యుద్దేశించి అడిగింది కల్యాణి.

'అబ్బే! ఆలాబజార్కి వెళ్ళేను అక్కయ్యా' అని తన ముఖం అక్కచూస్తే ఎక్కడ మనస్సు కష్టపెట్టుకుంటుందో అని బుర్రవంచుకొని తనకు నిర్ణయించినగదిలోకి నడిచేడు.

తమ్ముడి వాలకంచూచిన కల్యాణి, దగ్గరగావచ్చి, 'ఏంరా ఆనంద్ అలాగున్నావు.'

'ఏంలేదక్కయ్యా, ఎలాగున్నాను?' అని తడబడినాడు.

'ఏమో నాకేం తెలీదు నాయనా! రోజూ మీబావ నీగురించి అడగటము యీమధ్య బొత్తిగా నీ ఆరోగ్యం బాగులేనట్లుగా యున్నావని చెప్తూతూ, రాత్రిపూట యింటికి త్వరగా చేరుకోమని చెప్పారు.

'క్షమించు అక్కా, తప్పకుండా' టవల్ తీసుకుని బాత్రూమ్లోనికి వెళ్ళిపోయేడు.

'ఏం మీతమ్ముడు యింకా రాలేదా!' అని షర్టు విప్పుకొని హేంగరుకు తగిలిస్తు అడిగేడు భాస్కర్.

'వచ్చేడండి_ అలా_ బాత్రూమ్లోకి వెళ్ళేడు అని కల్యాణి తమ్ముడికి, శ్రీవారికి భోజనాల కుపక్రమించమనిచెప్పి, వారితోసహా ఆమెకూడ భోజనంచేసి నాటి దినచర్యకి సెలవు తీసుకుంది.

ఆనంద్ తనగదిలో పడుకొని శరత్ పుస్తకాన్ని తీసి చదవడం మొదలుపెట్టేడు. కాని, తనకు చదువుతుంది ఏమిటో బోధపడటము లేదు. విసుగ్గా పుస్తకాన్ని మీదకి విసిరి, కిటికీగుండా దృష్టిని సారించేడు.

పైన నిర్మలంగాయున్న ఆకాశంలో చంద్రుడు, తారలతో దాగుడుమూత లాడుతున్నాడు. సుఖపడుతున్న జీవితాలనుచూచి ఓర్వలేనట్లు ఒకప్రక్కనుంచి కారుమేఘం కమ్ముకొస్తున్నది. ఆ.వాతావరణాని చూచిన ఆనంద్కు తన పూర్వస్మృతులు జ్ఞాపకానికొచ్చేయి యొక్కరి.

...    ...    ...    ...

ఆరోజులలో ఒక ప్రాథమికపాఠశాలలో లెక్కలు టీచరుగా పనిచేస్తు తను తెచ్చిన నెలవారీ జీతాన్ని లెక్కగా ఖర్చుపెట్టుతూ, పిల్లలు చిన్నతనములోనే

'మాధవి'ని కోల్పోయి, జీవితాన్ని గుట్టుగా, పిల్లలకు తల్లిలేనిలోటును తీరుస్తూ, కొడుకు, కూతురుని సమర్థులుగా చేయాలని నిర్ణయించుకున్న మధ్యరక కుటుంభీకుడు మాధవరావు.

తల్లి మరణించేసరికి కల్యాణికి 8 యేళ్లు, తెలిసీ, తెలియనిజ్ఞానంలో తమ్ముడుని మంచిదారిలో నడిపిస్తు, తండ్రి చెప్పిన మెట్రిక్యులేషన్ పరీక్షలో కృతార్థురాలయింది. ఆడపిల్లని ఎప్పటికేనా యొక యింటిదాన్ని చెయ్యాలని, ఆబాధ్యత కూతురునిగన్న తనకు యున్నదని గ్రహించిన మాధవరావు కల్యాణికి పెండ్లిసంబంధాలు వెతకడం ప్రారంభించేడు. భగవంతుని అనుగ్రహామువల్ల మెట్రిక్యులేషన్ ప్యాసుఅయిన రెండేండ్లకు కాకినాడలో యొక కంపెనీ మేనేజరుగా పనిచేస్తున్న భాస్కరరావుతో తన స్థోమతకు తక్కువలేకుండా యొక శుభముహూర్తాన్న వివాహాన్నిజరిపించి, ఆనందించిన మాధవరావుని అప్పగింతలసమయంలో కన్నీటినిగార్చిన మాధవరావును అక్కా! అని జాలిగా ఏడుస్తున్న ఆనంద్‌ని తలిస్తే నేటికి కల్యాణిగుండె తరుక్కుపోతుంది.

మా శ్రేయోభిలాషులకు దీపావళి అభినందనలు !

* చిరకాల మన్నిక
* చక్కని అల్లిక
* తక్కువ ధర
* శ్రేష్ఠమైన రకం

వీటి అన్నిటికీ

ఎంపైర్ బనీయన్లు

ప్రసిద్ధి చెందినది.

*

తయారించువారు :

EMPIRE KNITTING COMPANY

15, Old Market St :: TIRUPUR-4

కల్యాణి అత్తవారింటికి వెళ్ళింది. ఆ యేడే ఆనంద్ మెట్రిక్యులేషన్‌లో అడుగుపెట్టాడు. కుమారుడు మెట్రిక్యులేషన్‌కు రాగానే, కన్నతండ్రి ఆనందానికి అంతులేనట్లు మురిసిపోయేడు. అప్పటికప్పుడే ఆశతో తన చుట్టు యొక్క పెద్ద గాలిమేడను కట్టాడు. దాంట్లో తను నివసిస్తున్నట్లు భావించుతూ ఆసంవత్సరాన్ని అతి స్వల్పకాలంలో గడిపినట్లుగా తలంచి, ఆనంద్‌ని పరీక్షలకు కూర్చోపెట్టి తనను వరించబోయే అదృష్టదేవత గురించి ఎదురుచూస్తూన్నాడు. పిచ్చి మాధవరావు.

కాని విధివ్రాత ఎవరు తప్పించగలరు. కష్టాలు ఉమ్మడిగా వస్తున్నట్లు మొదటిమెట్టులోనే దెబ్బతిన్నాడు. ఆనంద్, ఆరోజు ఆనంద్ జీవితంలో తగిలిన యొక పెద్ద గాయం.

'నాయనా ఆనంద్!' అని బొంగురుపోయిన గొంతుతో పిలిచేడు మాధవరావు.

'ఏమి యీ అనర్థానికి కారణమా అని ఆలోచిస్తూన్న ఆనంద్, పిలిచేరా నాన్నా!' అని యొక్కసారి లేచి నించున్నాడు.


'అవును, నాయనా' అని కొడుకుభుజంమీద మెల్లగా చేతితో వ్రాస్తూ, 'విచారించకు నాయనా, అంతా నా దురదృష్టం, విధి నామీద ఎదురుతిరిగేడు బాబూ!' అని పైకండువాతో కారుతున్నకన్నీటికి ఆనకట్ట వేస్తూ.

'అంతా, విధిచేతులో కీలుబొమ్మలం బాబూ! అని పెదవి విరిచేడు. అందులోనే సర్దుకొని, పోనీనాయనా జరిగిందేదో జరిగింది, తిరిగి మనకార్యాన్ని మనం నెరవేర్చాలి. 'కష్టేఫలి' అని ధైర్యవాక్యలను బోధించేను కన్నకొడుకికి ధైర్యవాక్యలను బోధించేడన్నమాటే గాని, జీవితంలో యొక నిర్లిప్తతకూడ తోడుగా నిలిచి మనిషిని కొంచెం నుస్తిగ చేసింది.

తొలిమెట్టులోనే దెబ్బతిన్నమనిషి తదితరమెట్టను ఏర్పరచుకోవడములో శక్తిని మిళితముగ కలిగివుంటాడనే నమ్మకప్రాయుడైన మాధవరావుకు పైవిధముగా నిర్లిప్తత ఏర్పడటములో సందేహామేమిటి?

జీవితాన్ని భారంగా గడుపుతూ ద్వితీయసారిగా పరీక్షగా కూర్చోపెట్టాడు ఆనందుని.

కాని, తొలిసంతోషాన్నికోల్పోయేడు మాధవరావు. మాధవరావు పూర్వపురోజులులాగ పని చేయకపోతున్నాడు. రోజుకురోజు శరీరములోని పట్టుతప్పి, తృప్తిని చేకూర్చుకోలేకపోతున్నాడు. గోరుచుట్టుమీద రోకటిపోటులాగ, సర్కారువారు యేనెలజీతము, ఆనెల ఇవ్వటములో చిన్నకన్ను వేయబట్టి, రోజులు భారంగ నడు




స్తున్నాయి. కష్టాలను ఎదుర్కొనటములో నిస్సహాయుడైన తనకు, తిరిగి రెండవసారికూడ 'తనబాబు' పరీక్షలో తప్పేడన్న బాధకన్న ఆనాడు 8 గం॥ అయిన యింటికి చేరనికుమారునిగూర్చి ఆందోళనతో సతమతమవుతూ, అటు-యిటు తిరుగుతున్నాడు. తనగదిలో హృదయాంతర గందరగోళం భరించలేనివాడు వీధిలోకి వచ్చిచూసేడు.

చిన్నచినుకు ప్రారంభమైనది. అయిన ఆనంద్ జాడలేదు. వెర్రిగా తిరుగుతూ ఒకసారికి మరొకసారి బయటకువెళ్ళి చూస్తున్నాడు. ఈసారి మనిషినిపోలిని ఆకారం తనవేపు వస్తున్నట్లు గుర్తించి, గురుతించినమనిషి ఆనందన్ అని తెలియగానే వెళ్ళి ఆప్యాయంగా కౌగలించుకుని-

'ఎక్కడ నాయనా!' యింతవానలో తిరిగేవు అని శరీరమంతా నిమురుతూ-

'అయ్యో! బట్టలు పూర్తిగ తడిసేయని లోలోన గొణుగుతూ, తడిసినతలను తుడుస్తూ, 'పిచ్చినాయనా!' బ్రతికుంటే బలుసాకేనా తినవచ్చని చెప్పి బలవంతంగా యింత అన్నం తినిపించి, పక్కమీద పడుకోపెట్టాడు. జీవితంలో మాయని గాయం ఏర్పడ్డ మాధవరావు.

ఆనంద్ కు ఎంత నిద్రపోవాలన్న నిద్రా రాలేదు, 'తనబ్రతుకుగురించి తనకుతాను యొకసారి 'నిందించుకొ ప్రక్కకుతిరిగి చూసేడు.

తనతండ్రి తన భావిజీవితానికి మెరుగులు దిద్దాలని అష్టకష్టాలుపడుతున్న కన్నతండ్రి సుఖమంటే ఎరగని నిర్భాగ్యుడు ఆనందాన్ని అనుభవించలేకపోతున్న కొడుకుకి 'ఆనంద్' అని పేరుపెట్టి ఆ పేరుకొక రూపాన్ని తేవాలని వెర్రికలలుకన్న పిచ్చినాన్న.

ఈవిధంగా ఆనాడు ఎన్నోరకాలుగా, ఏమిటేమిటి ఆలోచించాడోకాని, అంతుపట్టని ప్రశ్నగా మారింది.

సమర్థుడని చేయలేకపోయినాననే అత్యంత విచారముతో తండ్రి మంచాన్ని చేరేడు. అటువంటిసమయంలోకూడ అక్కడ యీవార్తను తెలియబరుస్తే మనసును కష్టపెట్టుకుంటుందని ఇప్పటికే తను పరీక్షలో కృతార్థుడు కాలేకపోయాననే వార్త తెలిసిన కల్యాణి ఎంతగ బాధపడుతుందో తెలిసిన ఆనంద్, తండ్రికి అహోరాత్రులు సేవచేస్తూ తిరిగి ధృడపరచుకున్న మనస్సుతో తృతీయపర్యాయంగా పరీక్షను ఎదుర్కొన్నాడు. కాలచక్రం యొకసారి తిరిగింది. పరీక్షాఫలితాలు వచ్చేయి, కృతార్థుడయేడేకాని, ఆనంద్ కి ఆనందం తగుపాళ్ళలనే వుంది. ఆదేవార్తను మెల్లిగా తండ్రిచెవిలో వేసేడు.

కన్నతండ్రి మనస్సు యొకసారి విప్పారింది. అంతలోనే నిరాశ రేఖలు ముఖాన్న ప్రవేశించేయి. కనీకన పడనీయకుండా నిరాశను దగ్గుతెర అడ్డింది. దగ్గి, దగ్గి నోటివెంబడి రక్తం కక్కేడు మాధవరావు. రక్తాన్ని చూడ్డలేక నిశ్చేష్టుడై వెంటనే బావకు టెలిగ్రాం యిచ్చేడు ఆనంద్.

'నాన్నకి ఏలాగుంది ఆనంద్?' అని అడుగుపెడుతున్న కల్యాణినిచూచి కళ్ళంట నీళ్ళు కార్చేడు. భాస్కర్ ఆందోళనగా వెళ్ళి అప్పుడే దగ్గి ఆయాసపడుతున్న మామగారిని చూచి,

'ఏలాగుందండీ' అని ఆశగా అడిగేడు.

'బాగానేయుంది నాయనా! ప్రక్కన కూర్చోమని సైగచేసేడు. కంటినీరు పెట్టిన కల్యాణిని చెయ్యిపట్టుకుని ప్రక్కన కూర్చోపెట్టుకున్నాడు. ఈసారి ఆనంద్ని దగ్గరగా పిలిచేడు. ఇంతలో తిరిగి దగ్గుతెర.

ముగ్గురు పట్టుకొని, వెనకవ గోడకు తలగడా అన్చి దానికి చేరగిరి కూర్చోపెట్టారు.

జీవితపు తీపిదనాన్ని చూడని మాధవరావు, ఏదో చెప్పాలని ఆశ, చెప్పలేక అతి కష్టముమీద కల్యాణి, భాస్కరుల చేతులుపట్టుకొని. ఆనంద్ చేతులనుంచుతూ,

'ఇకపై ఆ . నంద్ ... జీవితము మీ...మీదే...ఆ అని చెప్పుతూ తదుపరిభావాలను వ్యక్తపరచలేక భారంగా రెండుకళ్ళను దగ్గరగ మూసేడు.

ఆనాటితో ఆకుటుంబంయొక్క పెద్దప్రాణి ఆత్మ పరమాత్మలో కలిసింది.

... ... ... ...

తండ్రిమరణం జ్ఞాపకంరాగానే ఆనందుకు ఏకధారగ కళ్ళవెంబడి నీరు కారింది. వర్షాన్ని చూసిస్తు మేఘాలు ఘర్జిస్తున్నాయి. తారలతో దోబూచులాడుతున్న చందమామ కనుచూపుమేరలో లేదు. కిటికితలుపులను దగ్గరగా వేస్తూ నిద్రకై మంచంమీద వాలేడు. కాని నిద్రాదేవిని ఆహ్వానించలేకపోయేడు తిరిగి తలంపు ఆరంబం.

తండ్రి మరణానంతరం, అక్కబావతోసహా కాకినాడ వచ్చేడు. తండ్రిపోయిన పాకకి ఆరునెలలు ఆసుపత్రిలోయున్న ఆనంద్ తిరిగి యింటిని చేరగనే పునర్జన్మయెత్తినట్లు భావించారు దంపతులు.

జాతకం తెలిసిన జ్యోతిష్కుడులా తను మొదటి మెట్టుమీద దెబ్బతిన్నప్పుడే తండ్రికి మనోవ్యాధి పట్టుకున్నది. లేకపోతే తుదకు నిరాశతో ఎందుకు మరణించేరు అనుకున్నాడు. తిరిగి జన్మని ప్రసాదించినందుకు భగవంతుని లోలోన నిందచేసేడు. ఆసమయంలోకూడ తనయందు పక్షపాతం చూపించిన 'దేవదేవుడు'ని క్షమించలేకపోయేడు. తుట్టతుదకు నిరుపయోగ్యుడని తలపోసేడు, ఆలోచనలతో అలసిపోయిన మెదడు, బరువుగాయున్న కనురెప్పలు, ఏదో ఆశ, అంతలోనే చెప్పలేని నిరాశ ఆపైన అంతా భగవదీచ్ఛ అని తలంచిన ఆనంద్ ఎప్పుడు నిద్రాదేవి ఒడిలో వాలేడో తెలియదు.

రోజులు గమనాన్ని సాగిస్తున్నాయి. కాలచక్రం గిర్రున తిరుగుతున్నది. ఆనంద్కు భాస్కర్ పనిచేస్తున్న కంపెనీలో గుమస్తా యుద్యోగమైంది. ఇష్టంలేని వస్తువును తిన్నట్లు, కష్టమైనజీవితాన్ని ఈతరాని సాహసిలాగ జీవితమనే నదిలో ఈదుతున్నాడు మన ఆనంద్.

సృష్టికర్త లోకంలో కష్టాలను ప్రసాదించిన మానవులకు తిరిగి కష్టాలను ఎదుర్కొనమని ఆజ్ఞాపించడములో గల గూడార్థము? కాదు వారి సౌమ్యానికి పరీక్షా?... అన్నట్లు.

భర్తను, సోదరుడుని ఆఫీసుకు పంపించిన కల్యాణి స్టౌవ్ మీద పాలుపెట్టి కథానిమగ్నురాలై కూర్చుంది. పాలు అగ్నికి ఆహుతి అవబోతుందన్న తొందరలో చీర కొంగుతో పాలు దింపింది. కథ పూర్తిచెయ్యాలనే సందడిలో పరుగెత్తినకల్యాణికి చెంగుకి నిప్పు అంటుకున్నదన్న సంగతి వీపుకాలినవరకు తెలయలేదు. వెంటనే చీరకట్లలు విప్పలేక అరుపులరచి స్పృహతప్పి పడిపోయింద. భాస్కర్ స్నేహితుడైన ప్రక్కింటి వేణుగోపాల్ అరుపు విన్నవెంటనే వచ్చి చూసిన సంగతి ఫోనుద్వారా భాస్కరుకి తెలియబరిచేడు. ఆదరా బాదరాగావచ్చిన బావమరుదులు కాలిన కల్యాణి శరీరాన్ని ఆసుపత్రికి తిసుకొనివెళ్ళేరు. పరీక్షకై లోపలకి తీసుకెళ్ళేరు కల్యాణిని. మతి చెలించిన బావమరుదులు పిచ్చిగా తిరుగుతున్నారు.

ఎటువంటిమాట వినవలసివస్తుందా అని ఆందోళనలతో సతమత మవుతున్నారు. కొద్దినిముషాలవెనకే అపశకునాన్నిసూచిస్తూ, పిల్లి అక్కని ఆసుపత్రికి తీసుకువెళ్లుతున్నప్పుడు ఎదురుగుండా రావటము. ఇంక ఆలోచించలేకపోయిన ఆనంద్కు కాళ్లు నిలబడలేక నీరసాన్ని బుజావు పరుస్తున్నాయి, అప్పుడే తలుపులు తెరుచుకొని, వస్తున్న డాక్టరునిచూచి ఆత్రుతగా దగ్గరికి వెళ్ళేరు.

'సారీ, మిస్టర్ భాస్కర్' అని భుజంతట్టి భారంగా రెండడుగులు ముందువేసేడు డాక్టర్.

'అక్క ..అని పెద్ద అరుపు అరచి నేలకొరిగేడు ఆనంద్.

'కల్యాణి అంటూ లోపలికి పరుగెత్తాడుభాస్కర్.'

ఆనంద్‌కి మతి నిమితంలేదట, విశాఖపట్నం మెంటల్ ఆసుపత్రిలో చూపించమని డాక్టర్లు యిచ్చిన సలహాలను తీసుకొని వెళ్లేడు భాస్కర్ ఆనంద్ దురదృష్టవంతుడు అని ఋజువుపరుస్తూ అక్కడకూడా 'అబ్బాయి బాగా పాడు తిన్నాడు, ఇది కుదరడం కష్టం' అని తెలిసిన భాస్కర్ నిరాశతో ఆనంద్‌ని వెంటబెట్టుకొని కాకినాడ చేరేడు.

ఇప్పుడు ఆనంద్ పిచ్చివాడు. ఏం మాట్లాడినా పిచ్చిగా మాట్లాడడం, ఏపనిచేసినా పిచ్చిగా చెయ్యడం, రాత్రింపగళ్లు అక్క ఫోటో చేతిలోయుంచుకొని నిరాశగా.

'అక్కా వెళ్ళిపోయావా? మరి రావు? నాన్నతో సహా నీవుకూడా వెళ్ళిపోయావా?

అందులో మళ్ళీ ఆశారేఖ జనిస్తుంది. 'ఓహో! మళ్ళీ నాన్నగారితో మాట్లాడి వస్తావుకదూ! అక్కా...అ...క్కా...పరీక్ష పేసయేనని చెప్పు! అందులోనే విచారం పాపం నాన్నగారు వినలేదు. నేను పరీక్ష పేసయినట్లు.

ఇంతలోనే ఆనందం. పై చదువులు చదువుకొని, పెద్దవాడినై పోతున్నా...చూచుకోవాలి...నిన్ను బావని యొక కారులోపెట్టి ఊరేగించేస్తాను. చూస్కోమరి. అని చిన్న చిరునవ్వు. అందులోనే తెలియని జ్ఞానిలాగ. అసలు అమ్మ ఎక్కడుందో అక్కా! అందులోనే ఆహ్వానం. పోనీలే అందరిని తీసుకోనిరా! ఆ...అలాగే నీ '......' అలాగే, అన్న పిలుపువిన్నట్లు కేరింతలుచేస్తూ ఫోటోను అటూయిటూ తిప్పుతున్న ఆనంద్ చేతిలోంచి జారి గాజుముక్క ముక్కలైంది. గాజుముక్కల మధ్య కల్యాణి విచారమనస్కురాలై కనిపించింది. ఆనంద్ ముఖంనిండా చెమటలు పట్టేయి. వెర్రిగా నవ్వేడు. గట్టిగా నవ్వేడు. ఇంకా నవ్వేడు. నవ్వలేక నవ్వలేక ఆఖరికి సొమ్మసిల్లిపోయేడు.

అలజడివిన్న భాస్కర్ వెంటనే వచ్చి చూసేడు. కల్యాణి తదనంతరం ఆనంద్ ఈవిధంగా సొమ్మసిల్లుతుండబట్టి, తనకుతాను నిలద్రొక్కుకొని ముఖంమీద నీళ్లు జల్లేడు. ప్రక్కన తునీతునకలై పడియున్న కల్యాణి ఫోటో చూసి సంగతి గ్రహించేడు. తెలివిరాని ఆనంద్ ముఖాన్ని యొక్కసారి పరికించేడు.

'పాపం, దురదృష్టానికి నిజమైనరూపం ఆనంద్.

చిన్నవయస్సులో పలుకష్టాలను ఎదుర్కొన్న ఆనంద్ తను పునర్జన్మ ఎత్తేడంటే తన అభిమానురాలైన అక్క గురించే అని ఎంచిన ఆనంద్-

భావిజీవింలో 'ఆనంద్' అనే పదానికి నోచుకోలేని నిర్భాగ్యుడు, చిక్కి శల్యమైన శరీరం...

భగవాన్ యిదేనా జీవితం...అని కనుకొనలనుండి నీటిబిందువులను రాలుస్తున్న భాస్కరుని చూచేడు.

అప్పుడే కళ్లు తెరచిన ఆనంద్ ఏంబావ ఏడుస్తున్నావు అక్కగురించా! అక్కరాదు బావా! మరి యికరాదు. నేనే అక్కదగ్గరకు వె-ళ్-తా-ను. అంటూన్న ఆనంద్ మస్తిష్కంలోయున్న జ్యోతి అనంతవాయువులలో కలసిపోయింది.

'భగవాన్, నీలీలలు ఎటువంటివోకదా!' అని యొక గాఢనిట్టూర్పు విడిచేడు భాస్కర్.





మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు !!

శాంతి డైమండ్స్

*

రసాయనిక వజ్రములు తయారించుటలో ప్రసిద్ధి చెందియున్నాము.

వివరములకు

బి. కె. ఎస్. కన్నన్ & బ్రదర్స్.,

నెం. 37. పెద్ద సౌరాష్ట్ర వీధి : : తిరుచిరాపల్లి-8.